క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలోకి జనసేన కార్యకర్తలు

భీమవరం: భీమవరంలో జనసేనకు భారీ షాక్ తగిలింది. జనసేన ప్రాబల్యం కీలకంగా ఉన్న గునుపూడికి సంబంధించిన పలు వార్డులతో పాటుగా ఇతర వార్డుల నుంచి కూడా జనసేన కార్యకర్తలు ఆదివారం రాత్రి క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి గ్రంధి శ్రీనివాస్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2019లో తనను విడిచి వెళ్లిన వారంతా కూడా ఎటువంటి సంకోచం లేకుండా తిరిగి తన వద్దకు రావాలని, వారిని వదులుకునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. 2004 నుంచి 2009 వరకు, 2019 నుంచి నేటి వరకు నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో పనులు చేసినట్లు తెలిపారు. భీమవరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అండర్ టన్నెల్స్‌ను నిర్మాణానికి కృషి చేయగా, ఇవి కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవి కాబట్టి ఈ అభివృద్ధి తాను చేసినట్లు కాదని కొంతమంది అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. రైల్వే డబ్లింగ్ భీమవరంలో మాత్రమే జరగలేదని, ఇతర ప్రాంతాల్లో కూడా జరిగిందని, ఎక్కడైనా అండర్ టన్నెల్స్‌ను నిర్మించారా అని ఆయన ప్రశ్నించారు. అంతేకాకుండా రైల్వే గేటు ఉన్నచోట మాత్రమే అండర్ టన్నెల్స్‌ను నిర్మిస్తారని, కానీ భీమవరంలో రైల్వే గేట్ లేనిచోట కూడా అండర్ టన్నెల్స్‌ను నిర్మించి భవిష్యత్తులో కూడా ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. స్థానిక ఎమ్మెల్యే సూచనల మేరకే కేంద్ర ప్రభుత్వ పనులు కూడా జరుగుతాయనే విషయాన్ని కొంతమంది అవగాహన లేనివారు తెలుసుకోవాల్సి ఉందన్నారు. భీమవరం అభివృద్ధిని కాంక్షించే ఇతర పార్టీలలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా తనతో కలిసి నడిచేందుకు ముందుకు రావాలని గ్రంధి శ్రీనివాస్ కోరారు. పార్టీలో చేరినవారిలో అప్పన కొండలరావు, వాసన శ్రీనివాసరావు, మంచెం త్రిమూర్తులు, మద్దాల సత్యనారాయణ, పిండి ప్రసాద్, మద్దాల శ్రీనివాస్, కాళి సత్యనారాయణ, పాలూరి ఏడుకొండలు, మద్దాల ఏసునాయుడు, భీమాల కృపావరం, భీమాల గోపాలకృష్ణమూర్తి, బాలం చిట్టిబాబు, చింతా లక్ష్మణరావు, నేదూరి సతీష్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, కట్రెడ్డి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

అత్తిలి: మహిళల ఆర్థిక స్వావలంబన కోసం మగవారితో సమానంగా ఆడపిల్లలను పెంచాలని ఐసీడీఎస్ తిరుపతిపురం సెక్టార్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుపతిపురం, గుమ్మంపాడు, బల్లిపాడు, యర్రనీలిగుంటలో ర్యాలీలు, మానవహారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్నారు. ఈ సందర్భంగా మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పులవర్తి గిరిజ, బి రాజకుమారి, జి లక్ష్మీకుమారి, ఎం శివ సత్యవతి, జి శిరీషా, వీరలక్ష్మి, బి స్వరూపారాణి పాల్గొన్నారు.

అలంపురం వద్ద కారు బోల్తా

పెంటపాడు: అలంపురం వెంకయ్య కాలువ వద్ద తణుకు వైపు రోడ్డుపైకి వస్తున్న సమయంలో ఒక కారు ఆదివారం మధ్యాహ్నం ప్రమాదానికి గురైంది. పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన నలుగురు కుటుంబ సభ్యులు ఉంగుటూరు మండలంలో నిర్వహించే ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగి స్వగ్రామం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అలంపురం వెంకయ్యకాలువ సమీపంలో రోడ్డు ఎక్కుతూ కారు అదుపుతప్పి డివైడర్ అవతల వైపున బోల్తా పడింది. కారులో ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఈ విషయంపై పెంటపాడు పోలీసులకు సమాచారం అందలేదని తెలిపారు.

వైభవంగా కోదండ రాముని కల్యాణోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్ : దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార ప్రరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార మహోత్సవాల్లో భాగంగా బలుసులమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఆదివారం రాత్రి 7 గంటల నుంచి ఒంటిమిట్ట కోదండరాముని కల్యాణాన్ని నిర్వహించారు. కొట్టు విశాల్ పాల్గొని పూజలు నిర్వహించారు. కోదండరాముని కల్యాణం అనంతరం స్వామి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆయా దేవస్థానాల నిర్వహణ అధికారులు, సిబ్బందితోపాటు బలుసులమ్మ దేవస్థానం ఈఓ రవిశంకర్, ఆలయ ఛైర్మన్ కొట్టు అంజిబాబు, కర్రి భాస్కరరావు, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్‌కుమార్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఈ-క్రాప్ జాబితా సరిచూసుకోవాలి

మొగల్తూరు: ఈ- క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్న ఈ-క్రాప్ జాబితాను సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సాగు చేస్తున్న రైతుల పేర్లు, సాగు విస్తీర్ణం, పంట వివరాలను ఆర్‌బీకేలోని నోటీస్ బోర్డులో ఉంచామని, రైతులు పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే మంగళవారం లోపు తెలియపర్చాలని సూచించారు. ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా రైతులు జాగ్రత్తపడాలని ఆయన కోరారు.

దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- కొవ్వాడ అన్నవరం గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభం


సీసీ రోడ్డు శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: తన వల్ల మేలు జరిగితేనే తనకు ఓటు వేయాలని ధైర్యంగా ప్రజలను అడుగుతున్న దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ అన్నవరం గ్రామంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో జరిగిన అభివృద్ధి పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి గ్రామం, పట్టణంలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంక్షేమం రూపంలో నవరత్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించామన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా 2019 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీల అన్నింటిని అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల కోసం ఒకసారి మాట ఇస్తే వెనుకడుగు వేయకుండా ఆ మాటను అమలు చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్, భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న తనకు రానున్న ఎన్నికల్లో ప్రజలు మద్దతుగా నివాలని కోరారు. అంతేకాకుండా కరోనా సమయంలో ప్రజలకు కరోనా వైద్యాన్ని, దాని అనుబంధమైన బ్లాక్ ఫంగస్ వైద్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందించారని గుర్తు చేశారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ, వర్గ బేధం లేకుండా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, ఉద్దరాజు రాజేష్ వర్మ, వేగేశ్న నరసింహరాజు, అల్లూరి సాయిరాజు, బాచిరాజు, రాజ్‌కుమార్, శేషారావు, కలిదిండి రవివర్మ, ఇందుకూరి ఆంజనేయ రాజు, రంగారావు, గంగరాజు, కోమటి రాంబాబు, కొట్టి కుటుంబరావు, నామన మహేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రారంభోత్సవాల పండగ

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో సోమవారం నుంచి పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల పండుగ జరుగనుందని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఆదివారం చెప్పారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్ర భవనాలు, గ్రామ హెల్త్ క్లినిక్‌లు, రహదారుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను వెల్లువలా నిర్వహించనున్నట్లు చెప్పారు. పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థల పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమాల్ని చేపడుతున్నామన్నారు. సోమవారం ఆకివీడు మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్, స్థానిక వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనుల్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఆయా కార్యక్రమాలకు శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని నర్సింహరాజు తెలిపారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు


జొన్నలగరువులో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందిస్తున్న ఎంపీపీ పేరిచర్ల

భీమవరం అర్బన్: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాల్సిందేనని ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహరాజు అన్నారు. జొన్నలగరువులో ఆదివారం పేదలకు రిజిస్ట్రేషన్‌తో కూడిన ఇంటి పట్టాలను జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావుతో కలిసి ఎంపీపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహరాజు మాట్లాడుతూ కులాలు, మతాలు, రాజకీయాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అందిస్తున్నారని అన్నారు. అలాగే భీమవరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను రాబోయే ఎన్నికలలో అత్యధిక మెజార్టీతో గెలిపించి భీమవరం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుందామన్నారు. సర్పంచ్‌లు సోడదాసి లలిత కుమారి, ఆరేటి వీరాస్వామినాయుడు, వీఆర్‌వో పద్మనాభం, మద్దా రాజారత్నం, జద్దు తాతాలు, కొయ్యే సంపత్, భలే జ్ఞానరాజు తదితరులు పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు

భీమవరం (ప్రకాశం చౌక్): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందని మాజీ కౌన్సిలర్ కోడె యుగంధర్ అన్నారు. స్థానిక 18వ వార్డులో 192 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ దేశ చరిత్రలో లేని విధంగా రాష్ట్రంలో ఇళ్ల పట్టాల పంపిణీ ఒక ఉద్యమంలా సాగుతోందన్నారు. వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఒక్కరికీ అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు మేలు జరిగితేనే తనకు ఓటు వేయాలని అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. నవరత్నాలతోపాటు ఇతర ఎన్నో పథకాలను అందిస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలను అందించారు. కార్యక్రమంలో సోమేశ్వర స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ కోడే విజయలక్ష్మి, షేక్ ఎండీ పాషా, గాదిరాజు రామరాజు, కోడె శ్రీధర్, కోడె సతీష్ కుమార్, షేక్ సైనింసా, నీలపు వెంకట్, మాదుగుల దుర్గాప్రసాద్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ


వేణుగోపాలస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న వేదపండితులు, సర్పంచ్ సాంబశివరావు

ఉండి: చెరుకువాడలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగమ మహదాచార్యుడు ఖండవిల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి, గోదర్శనం, శాంతి కల్యాణం, మహాదాశీర్వచనం, పండిత సత్కారం, నీరాజన, మంత్రపుష్ప పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సర్పంచ్ కొండవేటి సాంబశివరావు, గ్రామ పెద్దలు మాట్లాడుతూ గత నెల 27న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ, వెంటనే వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. దేవదాయశాఖ రూ.కోటి, భక్తులు, గ్రామ పెద్దలు, ప్రజలు రూ.కోటి విరాళాలతో మొత్తం రూ.2 కోట్లతో రెండు దేవాలయాలు అత్యంత వేగంగా నిర్మాణం కావడం దైవేచ్ఛ అన్నారు. అనంతరం దేవాలయంవద్ద అన్న సమారాధనను ప్రారంభించారు. గ్రామపెద్దలు కొండవేటి సత్తిబాబు, నడింపల్లి కృష్ణంరాజు, సూరగాని బాబూరావు, కొండవేటి సూర్యనారాయణ, సన్నిధి నర్సింహమూర్తి, పెన్మత్స బాబీ, ముత్యాల బాబు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా ఉండి

డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు


ఉండి రాజులపేటలో సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండి అభివృద్ధికి చిరునామాగా మారిందని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఉండి రాజులపేటలో జెడ్పీ నిధులు రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ పనులను ఆదివారం పీవీఎల్, ఉప సర్పంచ్ గొట్టుముక్కల కల్యాణ్‌వర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఉండి గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిందన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల్లో కూడా సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయిన్‌ల నిర్మాణం చేపడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడుపుతున్నామన్నారు. సంక్షేమ పాలనతో ప్రజలంతా లక్షాధికారులుగా మారారన్నారు. అర్హత ఉంటే చాలు వారికి సంక్షేమ పథకాలతో పాటు ఇంటిస్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తూ వారి జీవితాన్ని సంతోషంగా మార్చామన్నారు. అంతేకాకుండా నిరుపేదల పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేలా సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు మాట ఇస్తే తప్పకుండా చేయడు అని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. కానీ సీఎం జగన్ మాట ఇచ్చాడంటే చేసి తీరుతాడనే నమ్మకంతో ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉండిలో భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమన్నారు. మోసం చేసి ఓట్లు దండుకుని ముఖం చాటేసేవారిని ఇంటికి పంపించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమతం సౌజన్య, ఏఎంసీ ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, గులిపల్లి అచ్చారావు, కమతం బెనర్జీ, కరిమెరక మల్లికార్జున, కరిమెరక శివనాగరాజు, రాయి సతీష్, బడుగు బాలాజీ పాల్గొన్నారు.

9 మందికి ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచితవైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకులోని వివిధ ప్రాంతాల్లోని 9 మంది వృద్ధులకు ఇంటి వద్దనే వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి తగు ఆరోగ్య సూచనలు, సలహాలను అందించారు. అసోసియేషన్ సభ్యుడు పాతూరి శివన్నారాయణ ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

అలరించిన పంచరత్న కీర్తనలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సద్గురు త్యాగరాజ స్వామి 83వ ఆరాధనోత్సవాల సందర్భంగా త్యాగరాజ గాన సభ ఆధ్వర్యంలో స్థానిక బీవీఆర్ కళా కేంద్రంలో అమ్మనమంచి బలరామశాస్త్రి కళా వేదికపై ఆదివారం రాత్రి సంగీత విద్వాంసులతో పంచరత్న కీర్తనలు గానం చేశారు. బుద్దాల వెంకట రామారావు, గరికపాటి బాపయ్య శర్మ, సంగీత విద్వాంసులు, కళాకారులు, బీవీఆర్ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం


పీవీఎల్‌ను సత్కరిస్తున్న పాలకోడేరు మండల నాయకులు

కాళ్ల: ఉండి నియోజకవర్గంలో టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టి వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయటం ఖాయమని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ధీమా వ్యక్తం చేశారు. కాళ్ల మండలం పెదఅమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పాలకోడేరు మండల పార్టీ నాయకులు పీవీఎల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పార్టీ ప్రకటించిన మండల నూతన కమిటీ నాయకులు, సభ్యులు పీవీఎల్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుల ఉద్దేశించి పీవీఎల్ మాట్లాడారు. పాలకోడేరు మండలంలో భారీ మెజార్టీ సాధిస్తామని వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని అన్నారు. పార్టీ అభివృద్ధికి, ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పాలకోడేరు మండల కమిటీ నూతన ఉత్తేజంతో పనిచేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజాబలంతో మరోసారి ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని చెప్పారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీని అభినందించి వారిని సత్కరించారు. పార్టీ గెలుపునకు కృషి చేస్తామని ఉండి నియోజకవర్గంలో పీవీఎల్ గెలుపుకు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కటిక శ్రీదేవి, దుండి అశోక్, ఆళ్ల నాగేశ్వరరావు, పంపన రామకృష్ణ, కమ్మిలి భాస్కర్‌రాజు, కాటూరి శాంత కుమారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దాలి


భీమవరంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తున్న మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు


జొన్నలగరువులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ పేరిచర్ల


నవుడూరు జంక్షన్‌లో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ కవురు


ఉండి పీహెచ్‌సీలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్


కాళ్లలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ సోమేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో విజయవంతమైంది. ఆయా చోట్ల పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భీమవరం 24వ వార్డులోని యూపీహెచ్‌సీ స్కూల్‌లో విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలియో నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు ఉన్న ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ బిడ్డలకు పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. దుర్గాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పల్స్‌పోలియోను ప్రారంభించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు, ఆర్డీఓ శ్రీనివాసులురాజు పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని తరిమికొడదాం

భీమవరం అర్బన్: పోలియో మహమ్మారిని తరిమికొడదామని ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. జొన్నలగరువులో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 5 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. తుందుర్రు పీహెచ్‌సీ పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు 2,343 మంది ఉండగా 2,302 మందికి, గొల్లవానితిప్ప పీహెచ్‌సీ పరిధిలో 4,128 మంది ఉండగా 3,928 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు దయామణి, అరుణరాణి తెలిపారు. జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, సర్పంచ్‌లు ఆరేటి పెద్దబ్బు, సోడదాసి లలితకుమారి, డాక్టర్ ఈశ్వర్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలి

వీరవాసరం: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. నవుడూరు జంక్షన్ పీహెచ్‌సీలో ఆదివారం చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. అనంతరం కవురు మాట్లాడుతూ చిన్నారులు ఎవరు కూడా పోలియో బారిన పడకూడదనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. మండల వ్యాప్తంగా 95 శాతం పల్స్‌పోలియో పూర్తి అయ్యిందని వైద్యాధికారులు తెలిపారు. చికిలే మంగతాయారు, గెడ్డం భారతి పాల్గొన్నారు.

పోలియో చుక్కలు తప్పనిసరి

ఉండి: భవిష్యత్ కాలంలో నిండునూరేళ్ళు క్షేమంగా ఉండాలంటే పోలియో చుక్కలను చిన్నారులకు తప్పనిసరిగా వేయించాలని డీసీసీబీ ఛైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. ఆదివారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నాకులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని కాపాడుకుంటూ అందరూ చల్లగా ఉండాలని పీవీఎల్ కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కమ తం సౌజన్యబెనర్జీ, ఉప సర్పంచ్ గొట్టుముక్క ల కల్యాణ్‌వర్మ, ఏఎంసీ ఛైర్మన్ బొక్కా వెంకటేశ్వర్లు, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం సాధిద్దాం

ఆకివీడు: పోలియో రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రజలు సహకరించాలని వైఎస్సార్ సీపీ భీమవరం అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు మోటుపల్లి గంగాధరరావు అన్నారు. ఆకివీడులో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సీఎం వైఎస్ జగన్ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. పల్స్‌పోలియోను చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని పీహెచ్‌సీల ద్వారా 33,350 మందికి, అర్బన్‌హెల్త్ సెంటర్ ద్వారా 3,306 మంది చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. నగర పంచాయతీ వైస్‌ఛైర్మన్ పుప్పాల పండు, పట్టణ వైసీపీ అధ్యక్షులు అంబటి రమేష్, ఏఎన్‌ఎంలు, వైద్యులు పాల్గొన్నారు.

పోలియోపై విజయం సాధించాలి

కాళ్ల: పోలియో రహిత సమాజాన్ని స్థాపించి పోలియోపై విజయం సాధించాలని జెడ్పీటీసీ సభ్యులు పచ్చిగోళ్ళ సోమేశ్వర రావు స్పష్టం చేశారు. కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన పిల్లలకు పోలింగ్ చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. మండలంలో ఐదేళ్ల లోపు 7,076 మంది పిల్లలు ఉండగా, ఆదివారం 6,867 మందికి పోలియో చుక్కలు వేశామని వైద్యులు ఎస్.సునీల్ చెప్పారు. అనంతరం జెడ్పీటీసీన సోమేశ్వరావును వైద్యులు, సిబ్బంది సత్కరించారు.

పల్స్‌పోలియో నూరు శాతం పూర్తి చేయండి

పాలకోడేరు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చేయాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో పల్స్ పోలియో బూత్‌ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో అర్హులైన చిన్నారులు 4,669 మంది ఉండగా ఆదివారం 4,379 మందికి పోలియో చుక్కలు వేశారన్నారు. మోగల్లులో ఇటుకల బట్టీలో పనిచేస్తున్న 38 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారన్నారు. ఆయన వెంట డీఐ దేవసుధాలక్ష్మి, జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ భావన, డాక్టర్ చినమిల్లి వెంకట రంగం నాయుడు, వైద్యులు స్వర్ణలత, లీల లక్ష్మి ఉన్నారు.

6 నుంచి భీమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని శ్రీభీమేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయం వద్ద చలువ పందిళ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, లక్ష పత్రి పూజ నిర్వహించనున్నారు. భక్తులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేశారు. 8న తెల్లవారు జామున స్వామివారి కల్యాణం, ఆలయంలో కొలువైన శ్రీ మహిసాసురమర్దని అమ్మవారికి పలు అమ్మవార్ల అలంకరణ నిర్వహించి ప్రత్యేక పూజలు చేస్తారు. 6న సరస్వతీదేవి, 7న లక్ష్మీదేవి, 8న కనకదుర్గాదేవి, 9న లలితాత్రిపుర దేవి, 10న పార్వతీ దేవి, 9న రథోత్సవము, 10న తెప్పోత్సవము నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ ముచ్చర్ల శ్రీనివాసరావు ఆదివారం చెప్పారు.

7న చిలుకూరులో క్రైస్తవ మహాసభ

ఉండి: చిలుకూరులోని సెయింట్ థోమా లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న శిలువ ధ్యాన కూడిక మహాసభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు దుండె హరినాథ్, ఇజ్జిని షాలేంరాజు ఆదివారం తెలిపారు. సాయంత్రం 6గంటలకు సంఘ సీఆర్ యువరాజు అధ్యక్షతన నిర్వహించే ఈ సభలో అంతర్జాతీయ ప్రసంగీకుడు దైవసేవకుడు టీ జఫన్యాశాస్త్రి (విశాఖపట్నం) వాక్యోపదేశం చేస్తారన్నారు. విశ్వాసులు అధిక సంఖ్యలో ఈ మహాసభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.